సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం ၊ 20 ၊ జూలై ၊ 2024

మంచు ముసుగులో మత్స్యగెడ్డ



సుజనకోట పంచాయతీలో విస్తరించిన మత్స్యగెడ్డ వద్ద కమ్ముకున్న మంచు తెరల అందాలు కనువిందు చేశాయి. చూపరులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ ప్రకృతి అందాన్ని సాక్షి 'క్లిక్' చేసింది.

– ముంచంగిపుట్టు

న్యూస్‌రీల్

రావణ కాష్టంలా రాష్ట్రం

- కూటమి 45 రోజుల పాలనలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు
- వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు దారుణం
- ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి ధ్వజం



సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం 45 రోజుల పాలనలో రాష్ట్రం రావణ కాష్టంలా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ టీడీపీ గెలిచిన నాటి నుంచి దుర్మార్గ పాలన సాగిస్తుందన్నారు. ఏపీలో హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు అధికమయ్యాయన్నారు. కక్షసాధింపు ధోరణితో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించడమే కాకుండా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులతోపాటు ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను హత్యలు చేయడం అత్యంత అమానుషమన్నారు. బాలికలు, మహిళలకు రక్షణ కరువైందన్నారు. పాడేరుతో పాటు అనేక ప్రాంతాల్లో బాలికలపై అత్యాచార ఘటనలు, దారుణాలు జరగడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దిశ చట్టం ద్వారా బాలికలు, మహిళలకు రక్షణ కల్పించామని, ప్రస్తుత టీడీపీ పాలనలో ఆ చట్టాన్ని సాక్షాత్తూ హోంశాఖ మంత్రి అనిత అపహాస్యం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడకపోవడం సమంజసం కాదన్నారు.ఏపీలో జరుగుతున్న టీడీపీ అరాచక పాలనపై రాష్ట్రపతి, ప్రధానమంత్రి స్పందించి, స్వేచ్ఛపూరిత వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్‌కు అరకు ఎంపీ తనూజరాణి వినతి



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులు

సాక్షి,పాడేరు: వర్షాలు కురుస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేసి సీజనల్ వ్యాధులను నియంత్రించాలని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి విన్నవించారు. శుక్రవారం ఎంపీ, ఆమె భర్త చెట్టి వినయ్, రూడకోట సర్పంచ్ సురేష్ ఆయనను కలిశారు. శాలువాతో కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వ్యాధుల నియంత్రణ, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, గిరిజనులకు సురక్షిత తాగునీరు సరఫరా వంటి సమస్యలపై కలెక్టర్‌కు ఎంపీ వినతిపత్రం అందజేశారు.

వరదలతో అధైర్య పడొద్దు

- చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



వరద సహాయక చర్యలపై సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

కూనవరం: వరదల పట్ల ప్రజలు అధైర్య పడొద్దని, ఎప్పుడూ అండగా ఉంటామని చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులతో వరదలపై సమీక్ష నిర్వహించారు. రాబోయే శబరి, గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ అధికారి అప్రమత్తంగా ఉండాలని, పునరావాస కేంద్రాలను తరచూ సందర్శిస్తూ పూర్తి స్థాయి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలలో శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గ్రామ కమిటీలను అనుసంధానం చేసుకుంటూ, ప్రజలకు మేమున్నామని భరోసా కల్పించాలని సూచించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, తహసీల్దార్ ఆర్‌వీ మురళీ కృష్ణ, ఇన్‌జార్జి ఎంపీడీవో లక్ష్మిరెడ్డి, ఎస్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్తంభించిన జనజీవనం

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. తెరిపివ్వకుండా కురవడంతో జనజీవనం స్తంభించింది. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, శబరి నదుల్లో వరద నీరు చేరుతోంది. గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి 26.2 అడుగులు ఉండగా రాత్రికి మరో మూడు అడుగులు పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్ కలెక్టరేట్‌లో ప్రజలు సత్వర సాయం పొందేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు.

- కొనసాగుతున్న వర్షాలు
- గోదావరి, శబరి నదులకు వరద తాకిడి
- పెరుగుతున్న నీటిమట్టాలు
- దెబ్బతిన్న రహదారులు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు
- జిల్లా వ్యాప్తంగా 954 ఎంఎం వర్షపాతం నమోదు



పరవళ్లు తొక్కుతున్న పొల్లూరు జలపాతం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో శుక్రవారం 954 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంపచోడవరంలో 89.8, దేవీపట్నంలో 88.4, కూనవరంలో 86.4, చింతూరులో 85.6, మారేడుమిల్లిలో 72.6, వీఆర్‌పురంలో 68.2, జి.మాడుగులలో 66.4, ఎటపాకలో 62.2, డుంబ్రిగుడలో 55.4, ముంచంగిపుట్టులో 45.4, అరకులోయ 30.2, అనంతగిరిలో 28.6, హుకుంపేటలో 26.8, వై.రామవరంలో 25.6, అడ్డతీగలలో 24.2, పాడేరులో 20.8, గంగవరంలో 19.8, పెదబయలులో 18.8, రాజవొమ్మంగిలో 16.4, చింతపల్లిలో 8.2, జీకేవీధిలో 8.2, కొయ్యూరులో 6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో భారీ వర్షాలపై రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అప్రమత్తం చేశారు.చింతూరు డివిజన్‌లో భారీ వర్షాలతో పాటు గోదావరి, శబరి నదుల్లో వరద నీరు పెరుగుతుండడంతో ముంపు గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.ముందస్తు సహాయక చర్యలపై అన్నిశాఖల అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు.

పాఠశాలలకు రెండు రోజులు సెలవులు

భారీ వర్షాలతో జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ విద్యాలయాలు,ప్రైవేట్ పాఠశాలలకు రెండు రోజుల పాటు సెలవులను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకటించారు. శుక్ర, శనివారాల్లో విద్యాలయాలను మూసివేయాలని డీఈవోతో పాటు అన్ని మండలాల ఎంఈవోలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

చలిగాలులతో అవస్థలు

వర్షంతో పాటు చలిగాలులు కూడా వీస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాడేరు, అరకు వారపు సంతల్లోను వ్యాపారులు, గిరిజనులు వర్షం కారణంగా సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సాగుకు అనుకూలమని వ్యవసాయశాఖ తెలిపింది. మత్స్యగెడ్డలో వరద నీరు చేరడంతో జోలాపుట్టు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి.

కొట్టుకుపోయిన రహదారులు

ఎటపాక: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.కృష్ణవరం పంచాయతీ పరిధిలోని చింతలచెరువు బీటీ రహదారి కోతకు గురైంది. టీడీపీ ప్రభుత్వం 2018లో చేపట్టిన ఈ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించనందున కొట్టుకుపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారి గోదావరి వరదల సమయంలో ఎనిమిది గ్రామపంచాయతీలకు ఉపయోగకరం. సీతాపురంలో గొల్లపల్లి రమణయ్య పెంకుటిల్లు కూలిపోయింది. కూనవరం ప్రధాన రహదారి నుంచి గౌరిదేవిపేట గ్రామానికి వచ్చే బీటీ రహదారి వరద నీటికి దెబ్బతింది.

చింతపల్లి రూరల్: మండలంలోని బలపం పంచాయతీ చెరువూరు వద్ద వాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో దిగజనబ, ఎగజనబ, లమ్మడంపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. వీరంతా నిత్యావసరాల కోసం పది కిలోమీటర్ల దూరంలోని కోరుకొండ వెళ్తున్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ తుడుమురాయి వద్ద కల్వర్టుపై నుంచి వరదనీరు ప్రవహించడంతో శుక్రవారం కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. చాలాచోట్ల వరి నారు, నాట్లు నీట మునగడంతో నష్టం జరిగిందని రైతులు తెలిపారు.



వీఆర్‌పురం: వరదకు దెబ్బతిన్న అన్నవరం వాగు చప్టా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

స్వల్పంగా పెరిగిన శబరి

చింతూరు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వస్తున్న వరదనీటితో శబరినది నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. గురువారం రాత్రి నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి సోకిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చింతూరు, వీఆర్‌పురం మండలాల ప్రధాన రహదారిలో జల్లివారిగూడెం వాగు రహదారి పైనుంచి ప్రవహించడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగుల్లో దిగకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది కాపలాగా ఉంటున్నారు. పొల్లూరు జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది.

వీఆర్‌పురం: ఉధృతంగా ప్రవహించిన అన్నవరం-ఉమ్మిడివరం గ్రామాల మధ్య అన్నవరం వాగు శుక్రవారం శాంతించింది. దీంతో చప్టా వద్ద చేరిన చెత్తను అధికారులు, ప్రజాప్రతినిధులు జేసీబీతో తొలగించి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. చేపలవేటకు వాగులవద్దకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్‌ను ఆదేశించారు. వడ్డిగూడెం కాలనీ రహదారిలో విద్యుత్ తీగలు, రహదారికి అడ్డంగా కూలిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వరద ప్రభావిత గ్రామమైన వడ్డిగూడెం లో గ్రామస్తులతో సీఐ రామారావు సమావేశం నిర్వహించారు. వరద సమయంలో చేపల వేటకు, పుల్లల సేకరణకు వెళితే చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఎస్‌ఐ కె.నాగరాజు,డీటీ ఎస్.సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం: ఈ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పొల్లూరు వాటర్ ఫాల్ ప్రవాహ ఉధృతి పెరిగింది. తడిక వాగు పొంగి ప్రవహిస్తోంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

సాక్షి, పాడేరు : జిల్లా కేంద్రం పాడేరులోని కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను కలెక్టర్ ఏర్పాటు చేశారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా రెవెన్యూ అధికారులు, సిబ్బందిని కలెక్టర్ నియమించారు. 08935-293120, 293448 లకు ప్రజలు ఫోన్ చేసి తగిన సహాయం పొందాలని ఆయన సూచించారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో..

పాడేరు : భారీ వర్షాల నేపథ్యంలో ఏపీఈపీడీసీఎల్, పాడేరు డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే కంట్రోల్ రూమ్ నంబర్ 9490610026కు ఫోన్ చేసి సమాచారమిస్తే వెంటనే తమ సిబ్బంది అక్కడకి వచ్చి విద్యుత్‌ను పునరుద్ధరిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



సీతాపురంలో కూలిన పెంకుటిల్లు



ఎటపాక మండలంలో భారీ వర్షానికి కోతకు గురైన చింతలచెరువు రహదారి



చింతూరు- వీఆర్‌పురం రహదారిపై నుంచి ప్రవహిస్తున్న జల్లివారిగూడెం వాగు

ఆనప డిప్పలతో సాహసం

ముంచంగిపుట్టు: వర్షా కాలంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని మారుమూల గిరిజన ప్రాంత ప్రజల అవస్థలు వర్ణనాతీతం. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామాలను వీడి రాలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించాల్సిందే. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. పంచాయతీ కేంద్రానికి రావాలంటే ఉబ్బెంగుల వాగును దాటాల్సిందే. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగును దాటేందుకు శుక్రవారం సాహసం చేశారు. నడుముకు ఆనప డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టుకుని పీకల్లోతు వాగును దాటుకుని లక్ష్మీపురం వచ్చారు.



డిప్పలు, ప్లాస్టిక్ బాటిళ్లను నడుముకు కట్టుకొని వాగును దాటుతున్న గిరిజనులు



ఉధృతంగా ప్రవహిస్తున్న పొల్లూరు వాగు



వరద నీటితో కళకళలాడుతున్న మత్స్యగెడ్డ



రంగశీల వద్ద చెరువులను తలపిస్తున్న పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న చాపరాయి గెడ్డ



వడ్డిగూడెం కాలనీలో కూలిన చెట్టు తొలగింపు

గిరిజనులకు అన్యాయం జరిగితే సహించం

- విద్యతోనే జీవితాల మెరుగు
- సత్వర సేవలు లక్ష్యంగా పనిచేయాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్



మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్



అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తూ...

సాక్షి,పాడేరు: గిరిజనులకు అన్యాయం జరిగితే సహించేది లేదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రం పాడేరు పర్యటించారు. కలెక్టర్ దినేష్ కుమార్ ఇతర అధికారులకు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమావేశమందిరంలో జిల్లా అధికారులతో గిరిజన అభివృద్ధి, హక్కులు,చట్టాలు అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పాడేరు పర్యటనలో సుమారు 40 ఫిర్యాదులు కమిషన్‌కు అందాయంటే వ్యవస్థ లోపమా..లేక గిరిజనుల లోపమా అంటూ అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు సేవలు అందించేందుకు జీతాలు ఇస్తున్నారని గుర్తుంచుకుని గిరిజనులకు సత్వర సేవలు అందించాలని సూచించారు. కింది స్థాయిలో తప్పులు జరిగితే పై స్థాయిలో అధికారులంతా కమిషన్ ముందు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ప్రతి పనికి లంచాలు తీసుకోవడం దారుణమన్నారు. గిరిజనుడికి ఇల్లు కట్టుకునే అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా కార్యక్రమాలను విస్తృతం చేయాలని, చదువుతోనే గిరిజనుల జీవితాలు మెరుగుపడతాయన్నారు. చదువులు లేకపోవడం వల్లే గంజాయి సాగు, మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని హెచ్చరించారు. గిరిజనుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాతీయ ఎస్టీ కమిషన్‌కు విశేష అధికారాలు ఉన్నాయన్నారు. భోగస్ ధ్రువపత్రాల జారీని నియంత్రించాలని, శిశు మరణాలు తగ్గించాలని, డయేరియా, మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా వైద్యసేవలు విస్తృతం చేయాలని ఆదేశించారు.అంతకుముందు కలెక్టర్ దినేష్ కుమార్ జిల్లా సమగ్ర వివరాలను ఆయనకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దర్, జేసీ భావన వశిష్ట, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో రచ్చకెక్కిన వర్గ విభేదాలు

సూపరింటెండెంట్‌కు వ్యతిరేకంగా వైద్యులు, సిబ్బంది నిరసన



ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సూపరింటెండెంట్ మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మిని ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ వైద్యులు, స్టాఫ్‌నర్సులు ఇతర సిబ్బంది చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. ఆస్పత్రి ఎదుట శుక్రవారం కూడా గంట పాటు వారు నిరసన తెలిపారు. ఇటీవల రంపచోడవరం ఐటీడీఏకు వచ్చిన కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది కలిసి, వినతిపత్రం అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ తమను వేధింపులకు గురిచేస్తున్నారని అందులో వారు పేర్కొన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరించిన తరువాత ఆయన ఏరియా ఆస్పత్రికి విచ్చేశారు. వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు అందుతున్న తీరును పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె.లక్ష్మిని ఆ పోస్టు నుంచి తప్పిస్తారని వైద్యులు, స్టాఫ్ నర్సులు భావించారు. అయినప్పటికీ ఆమె అదే పోస్టులో కొనసాగడంతో రెండు రోజులుగా వైద్యులు, స్టాఫ్ నర్సులు విధుల్లో ఉంటూ గంట పాటు తమ నిరసన తెలుపుతున్నారు. ఆస్పత్రిలో సిబ్బంది మధ్య చోటు చేసుకున్న విభేదాల నేపథ్యంలో ఇటీవల సదరన్ క్యాంపునకు వచ్చినవారు కూడా గంటలు తరబడి వేచి ఉండి ఇబ్బందులు పడినట్లు సమాచారం. ప్రతిరోజు సుమారు 300 ఓపీ ఉండే ఈ ఆస్పత్రిలో వైద్యులు, సూపరింటెండెంట్ మధ్య సమన్వయలోపం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలావుండగా ఆ పోస్టులో తాను కొనసాగలేనని ఐటీడీఏ పీవోకు సూపరింటెండెంట్ లేఖ ఇచ్చినట్లు సమాచారం. గత ఎనిమిది నెలలుగా ఆస్పత్రిలో వైద్యులు, సూపరింటెండెంట్ మధ్య నెలకొన్న విభేదాలు కొద్దిరోజుల పాటు సద్దుమణిగాయి. మళ్లీ ఇప్పుడు రచ్చకెక్కడంతో దాని ప్రభావం ప్రజల వైద్య సేవలపై చూపిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విధుల్లోకి తీసుకోవాలని గెస్ట్ టీచర్ల వినతి



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న సర్వశిక్ష అభియాన్ సెక్రటరీ

ఎటపాక: కేజీబీవీ పాఠశాలల్లో పనిచేసిన తమను కాంట్రాక్ట్ టీచర్లుగా నియమించాలని గెస్ట్ టీచర్లు కోరారు. శుక్రవారం వారు విజయవాడలోని సర్వశిక్ష అభియాన్ సెక్రటరీని సీపీఎం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆరేళ్లు గెస్ట్ టీచరుళ్లు పనిచేసిన తమను విధుల్లోకి తీసుకోవాలని వారు కోరారు. సీఆర్‌టీలకు సమానంగా తాము విధులు నిర్వహించి వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేశామని ఆయనకు గెస్ట్ టీచర్ల సంఘ సెక్రటరీ మధుసూదన్ వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఐవీ, ఐదు మండలాల గెస్ట్ టీచర్ల సంఘ ప్రతినిధులు కుమారి, వనజ, చంద్రమ్మ, పద్మశ్రీ, శాంతి, లత పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ దృష్టికి ఆదివాసీల సమస్యలు



ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు వినతి ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు





జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- 15 రోజుల్లో గిరిజనుల సమస్యకు పరిష్కార మార్గం
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్

పాడేరు : ఎస్టీ కమీషన్ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా పాడేరు వచ్చిన ఆయన స్థానిక గిరిజన భవన్‌లో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ఆదివాసీ సంఘాలు, ప్రజా సంఘాలు, ఆదివాసీ జేఏసీ నాయకులతో ఇష్టా గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు జీవో నెం.3 స్థానంలో షెడ్యూల్డ్ ఏరియా ఉద్యోగ నియామకం చట్టం తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచనాలు చేయాలని కోరారు. ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఏజెన్సీలో అన్యాక్రాంతమవుతున్న గిరిజనుల భూములను పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దు చేయాలని, ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు వినతులిచ్చారు. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ కమిషన్ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను 15 రోజుల్లో సమాధానం ఇస్తామని చెప్పారు. గిరిజనులకు సంబంధించిన ఏ సమస్య ఉన్న కమిషన్ దృష్టికి నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా తెలియజేయాలన్నారు. అనంతరం కమీషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌ను గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. బీజేపీ గిరిజన మోర్చా అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తమర్బ బాబూరావు నాయుడు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి, ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామరావుదొర, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణకు చర్యలు

పాడేరు : గిరిజన ప్రాంతాల్లో హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్‌ను శుక్రవారం అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు. శుక్రవారం ఆయనను కలిసిన వారు గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. జీవో నంబరు3ను పునరుద్ధరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో భూములు గిరిజనేతరుల చేతుల్లోకి బినామీల ద్వారా చేరాయని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆయనకు వివరించారు. గతంలో నమోదు చేసిన ఎల్‌టీఆర్ కేసులను త్వరగా విచారణ జరిపించాలని కోరారు. ఏజెన్సీప్రాంతాల్లోని ఏకలవ్య పాఠశాలల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను ఇటీవల నియమించారని, దీని వల్ల వారంతా హిందీలో బోధిస్తుండటంతో విద్యార్థులకు అర్థం కావడం లేదన్నారు. దీనివల్ల చాలా చోట్ల విద్యార్థులు పాఠశాలల నుంచి వెళ్లిపోతున్నారని, తక్షణమే స్థానికులను ఉపాధ్యాయులుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగు నీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. వారితోపాటు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గంపరాయి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, రూఢకోట సర్పంచ్ కాతరి సురేష్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు శరభ సూర్యనారాయణ, పాంగి నాగరాజు, మినుముల కన్నాపాత్రుడు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దన్నేటి పలాసి రాంబాబు ఆయనను కలిశారు.

మోదమ్మకు పూజలు

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ నాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పూజారి సుబ్రహ్మణ్యం,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

యాంత్రీకరణ సాగుపై అవగాహన



రైతులకు యంత్ర పరికరాల పనితీరును వివరిస్తున్న అధికారులు

వీఆర్ పురం: ప్రకృతి వ్యవసాయానికి యాంత్రీకరణను అనుసంధానం చేస్తే కూలీల ఖర్చు తగ్గించుకొని అధిక లాభాలు పొందేందుకు వీలు కలుగుతుందని సీడీఆర్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్) సంస్థ డైరెక్టర్ రిటైర్డ్ ఐఏఎస్ మనోహర్‌ప్రసాద్, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీ బాబు అన్నారు. రేఖపల్లిలోని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం రైతు సేవ కేంద్రం ద్వారా ప్రకృతి వ్యవసాయ రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచే విధంగా రూ.5 లక్షల రూపాయలు విలువైన వ్యవసాయ పనిముట్లను ఇరు సంస్థల ద్వారా పాపికొండల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకే ఈ పరికరాలను పంపిణీ చేస్తున్నట్టు వారు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతుల కోసం క్యాటల్ షెడ్‌లను సంస్థ ద్వారా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సంస్థ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కోయంబత్తూర్-దానాపూర్ మధ్య వన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్-దానాపూర్ మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. కోయంబత్తూర్-దానాపూర్ (06185) స్పెషల్ ఈ నెల 21న రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.15గంటలకు బయలుదేరి మంగళవారం అర్ధరాత్రి(బుధవారం తెల్లవారు) దాటిన తర్వాత 1.30 గంటలకు దానాపూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు 15-స్లీపర్ క్లాస్, 2-సెకండ్ క్లాస్ లగేజీ కం దివ్యాంగ కోచ్‌లతో నడుస్తుంది.

ఆలస్యంగా సంత్రగచ్చి-బెంగళూరు స్పెషల్



తాటిచెట్లపాలెం: సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు(08845) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అప్పన్నా.. వస్తున్నాం..





నేడే సింహ'గిరి ప్రదక్షిణ'

- సిద్ధమవుతున్న భక్తులు
- రేపు ఆలయ ప్రదక్షిణ
- ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం



సింహాచలం ప్రధాన ద్వారం

సింహాచలం : సింహగిరి ప్రదక్షిణకు సమయం ఆసన్నమైంది. వరాహ, నారసింహ రూపాలను ఒక్కటిగా చేసుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేంజేసిన 32 కిలోమీటర్ల కొండచుట్టూ ప్రదక్షిణ చేసే సమయం వచ్చింది. ఆషాఢ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం గిరి ప్రదక్షిణ ఉత్సవం జరగనుంది. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వరకు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం, రెవెన్యూ, జీవీఎంసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్, ఫైర్, ఎక్సైజ్ తదితరశాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేశారు. తుపాన్ కారణంగా ఏర్పాట్లకు అంతరాయం ఏర్పడినా భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయా శాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఏర్పాట్లు ఇలా...

- గిరి ప్రదక్షిణ మార్గంలో 29 ప్రదేశాల్లో స్టాళ్లు ఏర్పాటు చేశారు. అక్కడ భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు.
- 22 ప్రదేశాల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా 290 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- 11 ప్రదేశాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.
- 12 ప్రదేశాల్లో 17 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు.
- ఆరు ప్రదేశాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు
- సింహాచలంలోని తొలిపావంచా వద్ద నుంచి శనివారం సాయంత్రం 4గంటలకు పుష్ప రథం ప్రారంభమవుతుంది. రథంతో ప్రదక్షిణ ప్రారంభించే భక్తులు ఆ సమయానికి తొలిపావంచా వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.
- ఉదయం నుంచే పలువురు భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించడం పరిపాటి. దీన్ని దృష్టిలో ఉదయం నుంచే తొలిపావంచా వద్ద భక్తులకు సేవలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.
- సింహాచలంలోని స్వామివారి తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకు 50 క్యూ లైన్లు, 80 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు. అలాగే అడవివరం-హనుమంతవాక బీఆర్‌టీఎస్ మార్గంలో కొత్త ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద 20 ఇనుమ గడ్డర్లు ఏర్పాటు చేశారు.
- దారి పొడవునా భక్తులకు పలు స్వచ్ఛంధ సంస్థలుఆహార పదార్థాలు, పానియాలు, స్నాక్స్ అందించనున్నాయి.
- కొండచుట్టూ ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో జీవీఎంసీ తాగునీరు అందిస్తుంది. అలాగే పారిశుధ్యం,మరుగుదొడ్ల నిర్వహణ చేస్తుంది.
- ఆదివారం కేవలం కొండపైకి వెళ్లే భక్తులను మాత్రమే సింహగిరి మెట్లమార్గంలో అనుమతి ఇస్తారు. కొండదిగువకు అనుమతించరు. ఆరోజు ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొండదిగువకి వచ్చే భక్తులను దేవస్థానం బస్సుల్లో ఉచితంగా చేరవేస్తారు.

భక్తులు ప్రదక్షిణ చేసే మార్గం

సింహాచలంలోని తొలి పావంచా, అడవివరం, పైనాపిల్ కాలనీ, సెంట్రల్ జైల్, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్క్, అప్పుఘర్, ఎంవీపీకాలనీ, సీతమ్మధార, నరసింహనగర్, పోర్టు డీఎల్‌బీ క్వార్టర్స్, కప్పరాడ, మురళీనగర్, మాధవధార, ఆర్‌అండ్‌బీ కార్యాలయం, లక్ష్మీనగర్, కుమారి కల్యాణ మండపం, ప్రహ్లాదపురం మీదుగా తిరిగి సింహాచలం చేరుకోవాలి.



దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వంతెన

దర్శన సమయాలు

శనివారం ఉదయమే గిరి ప్రదక్షిణ ప్రారంభించి అదేరోజు రాత్రి చేరుకునే భక్తులకు రాత్రి 10గంటల వరకు స్వామివారి దర్శనాలు లభిస్తాయి. ఆదివారం ఉదయం 5.30గంటల నుంచి సాయత్రం 4గంటల వరకు నిర్విరామంగా దర్శనాలు అందజేస్తారు. తిరిగి సాయత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు, రాత్రి 8.30గంటల నుంచి 9గంటల వరకు దర్శనాలు లభిస్తాయి.

రేపు ఆలయ ప్రదక్షిణలు

- ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహగిరి ఆదివారం ఆలయ ప్రదక్షిణలు జరగనున్నాయి. ఉదయం 3గంటల నుంచి ఆలయ ప్రదక్షిణలకు అనుమతిస్తారు. ఆలయ బాహ్య ప్రకారం చుట్టూ 400 మీటర్ల మేర ప్రదక్షిణ చేయాల్సి ఉంటుంది.
- అప్పుఘర్ వద్ద స్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం 40 తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరం, 80 ఎల్ఈడీ దీపాలు, ఒక జనరేటర్, ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. వీరంతా పలు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించనున్నారు.
- మాధవధార వద్ద 40 తాత్కాలిక మరుగుదొడ్లు, ఒక వైద్య శిబిరం, 50 ఎల్ఈడీ దీపాలు, జనరేటర్‌ని అందుబాటులో ఉంచారు. ఒక పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు.
- కొండదిగువ, 29, కొండపైన 3 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- 21న సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులందరికీ నిర్విరామంగా కదంబం, దద్దోజనం అందజేస్తారు.
- సుమారు లక్ష లడ్డూలను విక్రయానికి సిద్ధం చేశారు.
- 21న జరిగే ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి ఉత్తర రాజగోపురం వద్ద, దక్షిణ రాజగోపురం వద్ద వంతెలను ఏర్పాటు చేశారు. ఆ వంతెనల పై నుంచి ఆలయ ప్రదక్షిణలు చేసే భక్తులను, వంతెనల కింద నుంచి దర్శనాలకు అనుమతించనున్నారు.
- నగర సీపీ సంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులు గిరి ప్రదక్షిణ బందోబస్తు నిర్వహించనున్నారు.
- పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంలు ఏర్పాటు చేసే ప్రదేశాలు : సింహాచలంలోని కొండదిగువ కలశం జంక్షన్, అడవివరం, హనుమంతవాక, అప్పుఘర్, మాధవధార, ఎన్ఎస్‌టీఎల్

గిరి ప్రదక్షిణ మార్గంలో ఏదైనా అత్యవసర పరిస్థితిలో భక్తులు సంప్రదించాల్సిన నంబర్లు

సింహాచలం దేవస్థానం
0891-2954944,
9390501082

జీవీఎంసి కమాండ్ కంట్రోల్ సెంటర్
1800-42500009

వాటర్ సప్లై, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్
0891-2869111

విశాఖ పోలీస్
9390105353,
93301010 5355

2600 మందితో భద్రతా ఏర్పాట్లు



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: గిరి ప్రదక్షిణకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం 2600 పోలీస్ అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు. శని, ఆదివారాలు జరిగే ఈ గిరిప్రదక్షిణలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బందోబస్తు అధికారులకు పలు సూచనలు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది పూర్తి సమన్వయంతో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా వేడుక జరిగేలా విధులు నిర్వర్తించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైమ్) వెంకటరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ సమస్యా...వాట్సప్ చేయండి



పర్యవేక్ష ఇంజనీర్ ఎల్.రవీంద్రనాథ్

చోడవరం రూరల్: ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై తెగిపడ్డాయా..? భారీ వర్షాలకు విద్యుత్తు స్తంభాలు వంగి ప్రమాదకరంగా మారాయా?.. ఈ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తుంటుంటే కలవడం లేదా...అయితే మీ కోసమే విద్యుత్ శాఖ అధికారులు వినూత్నంగా ఆలోచించి, ఆచరణలో పెట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా వాటప్స్ నంబర్ కేటాయించారు.పై విద్యుత్తు సమస్యలు ఏవైనా సరే వాటప్స్ చేస్తే పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు భరోసా ఇస్తున్నారు.

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతోపాటు పాడేరు ఐటీడీఏ పరిధిలో తలెత్తితే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్లతోపాటు అదనంగా వాట్సప్ నంబర్ సదుపాయాన్ని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎల్.రవీంద్రనాథ్ కల్పించారు. 7382249881 నంబరు గల వాట్సప్‌కు సమస్యలు తెలియజేస్తే తక్షణ పరిష్కారం చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. వర్షాల కారణంగా అధిక సంఖ్యలో ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఆయా విద్యుత్ జోన్ల వారీగా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. జోన్ల వారీగా కంట్రోల్ రూమ్‌లలో ఏర్పాటు చేసిన మొబైల్ నంబర్లను ఆయన తెలియజేశారు. విశాఖపట్నం సర్కిల్‌కు 7382249881, డివిజన్ ఆఫీస్ జోన్-1 కంట్రోల్ నంబర్ 9490610018, జోన్-2కు 9490610020, జోన్-3కు 9491030721 టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించినట్టు చెప్పారు. అనకాపల్లి డివిజన్‌కు 9490610022, కశింకోట డివిజన్‌కు 7382249866, నర్సీపట్నం డివిజన్‌కు 9491030714, పాడేరు డివిజన్‌కు 9490610026 నంబర్లకు కాల్ చేసి ఆయా పరిధుల్లోని వినియోగదారుల తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని ఈఈ తెలిపారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఏడీఈ ఉప్పలూరి కుమార్ గౌరీ ప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

వరిలో సస్యరక్షణకు సూచనలు

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు
- వర్షాల నేపథ్యంలో నారుమడి సంరక్షణపై రైతులకు సూచనలు



శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు

అనకాపల్లి : వరి వేసే రైతులు రాగల ఐదు రోజులలో వర్ష సూచన ఉన్నందున తేమను సద్వినియోగం చేసకుని ఎకరానికి 25-30 కిలోల విత్తనాన్ని 5 సెంట్ల నారుమడిలో విత్తుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొడి విత్తనం అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ 3 గ్రాములు, దంప నారుమడికి అయితే కిలో విత్తనానికి, కార్బెండజిమ్ ఒక గ్రాము లీటరు నీటికి చొప్పున లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ కిలో విత్తనానికి గ్రాము కలిపి విత్తన శుద్ధి చేసి విత్తుకోవాలని సూచించారు. 5 సెంట్లు నారుమడికి 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 2.5 కిలో యూరియా 2 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను విత్తే ముందు వేసుకోవాలని ఆయన కోరారు.

పొడతెగులు... : వరి నారుమడిలో, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున హేక్సాకొనజోల్ 2.0 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించవచ్చన్నారు.

కలుపు సమస్య : వరిలో వర్షాల కారణంగా కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున, పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ కలుపు మందును ఎకరాకు 80-100 గ్రా. చొప్పున 20-25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4-7 రోజుల్లో వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో జింకు/ఇనుము లోపం కనిపించే అవకాశం ఉన్నందున జింకు లోపల లక్షణాలు గమనించినట్టయితే 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి, ఇనుము లోప లక్షణాలు గమనించినట్టయితే లీటరు నీటికి 20గ్రా. అన్నభేది, 2గ్రా. నిమ్మ ఉప్పు కలిపి 5 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలని ఆయన కోరారు. కలుపు నివారణకు ఆలస్యంగా వేసిన వరిలో ప్రేటిలక్లోర్ కలుపు మందును ఎకరానికి 600 మి.లీ.పెండిమితాలి 38.7 శాతం సి.ఎస్. 700 మీ.లీ.చొప్పున వరి విత్తిన వెంటనే పిచికారి చేసుకోవాలని సూచించారు. 20 రోజుల వరి పైరులో గడ్డి వెడాల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు, బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లీ.ల చొప్పున పిచికారీ చేయాలని, గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సాప్రోప్‌పి ఇథైల్‌ను 350 మీ.లీ.లచొప్పున ఎకరా పొలంలో పిచికారి చేయాలి. 25-30రోజుల వయసుగల పైరులో వర్షాల వలన కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున 2,4-డి అమైన్ సాల్టు 58శాతం ఇ.సి. 2 మీ.లీ. 10గ్రా..ల యూరియాను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి, లేనిచో ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు 8 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన కోరారు. మొదటి దఫా యూరియాను ఎకరాకు 23 కిలోల చొప్పున విత్తిన 15-20 రోజులకు వేసుకోవాలన్నారు.

వేరుశనగ : ఖరీఫ్‌లో వేరుశనగ వేసుకునే రైతులు నేలను దున్ని, తయారు చేసుకుని కిలో విత్తనాన్ని 8 గ్రా..ట్రైకోడెర్మ విరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలని, 18 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 34 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను విత్తేటప్పుడు వేసుకోవాలన్నారు. విత్తిన మూడు రోజులలోపు పెండిమితలిన్ అనే కలుపుమందును ఎకరానికి 1 లీటరు చొప్పున పిచికారీ చేయాలని ఆయన కోరారు.